
AKSHARA TODAY
అక్షర నేటిడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
3-10-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

రెడ్‌క్రాస్ ఎన్నికలకు రంగం సిద్ధం





మోపాల్ శివారులో చిరుత సంచారం..

పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రాధాన్యం



అక్షరటుడే, కామారెడ్డి: అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు పారదర్శకమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే అధికారుల ప్రధాన లక్ష్యమని ఓటర్ల జాబితా పరిశీలకురాలు, మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి శ్రీదేవి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అధికారులు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, అదనపు కలెక్టర్ విక్టర్ పాల్గొన్నారు.

పారదర్శక ఓటరు జాబితా కోసం పకడ్బందీగా ఎస్ఐఆర్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లాలో అర్హులందరికి ఓటుహక్కు ఉండేలా తుది ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలని ఎన్నికల జాబితా పరిశీలకులు, రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా, పట్టణ ప్రణాళికా విభాగం సంచాలకులు టీకే శ్రీదేవి సూచించారు. ఆర్మూర్‌లో ఎస్ఐఆర్ పనితీరును శనివారం పరిశీలించారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లహరి, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాలతో కలిసి ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని మామిడిపల్లిలో 39వ పోలింగ్ స్టేషన్‌ను, ఆర్మూర్‌లోని 88వ పోలింగ్ కేంద్రాలను శ్రీదేవి పరిశీలించారు. ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, ఎన్ని హియరింగ్‌లు పూర్తయ్యాయి.. అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాల్కొండ, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నమోదు అధికారులతో సమావేశమయ్యారు. ఒక్కో నియోజకవర్గం వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు తీరుతెన్నుల గురించి ఈఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో బీఎల్వోల పనితీరును పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఈఆర్వోలకు సూచించారు. అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్, బాన్సువాడ ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, రవీందర్ పాల్గొన్నారు.



ఆ పై వసూళ్లు..!

- కామారెడ్డి బల్దియాలో నయా ట్రెండ్
- ఒకరిద్దరితో ఫిర్యాదులు.. మరికొందరు సెటిల్మెంట్లు
- కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లు, వెంచర్లే టార్గెట్ ■ షాడో కౌన్సిలర్ల తీరుతో బల్దియాకు మచ్చ

కామారెడ్డి బల్దియాలో వసూళ్ల పర్వం సాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా వెలుస్తున్న వెంచర్లు, కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లు వసూళ్లరాయుళ్లకు వరంగా మారుతున్నాయి. వసూళ్ల కోసం షాడో కౌన్సిలర్లు టీములుగా ఏర్పడ్డారన్న టాక్ బల్దియాలో చక్కర్లు కొడుతోంది. పార్టీ ఏదైనా, ఒకే పార్టీలో గ్రూపులు ఉన్నా చేసే పనిలో వాటా దొరికితే అంతే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

- అక్షరటుడే, కామారెడ్డి

రెవెన్యూ స్థలాన్ని వెంచర్‌గా మార్చే క్రమంలో అక్కడక్కడా పొరపాట్లు జరగడం సహజమే. అలాగే కొత్తగా నిర్మించే భవనానికి సరైన అనుమతులు తీసుకోకపోవడం కూడా నిజమే. అయితే అధికారుల నుంచి అనుమతులు రావడానికి ఆలస్యం కావడం, కొంతమంది నాయకుల ప్రోద్బలంతో అనుమతులు లేకున్నా వెంచర్లు ఏర్పాటు చేయడం, భవనాల నిర్మాణం చేపట్టడం పరిపాటిగా మారుతోంది. ఈ అనుమతులు లేకపోవడం, చిన్నపాటి పొరపాట్లు జరగడమే వసూళ్ల రాయుళ్లకు ఆదాయాన్ని తెచ్చే మార్గంగా మారింది. ముఖ్య నాయకులను మచ్చిక చేసుకుని అధికారులకు సైతం వాటాలు ఇస్తూ దర్జాగా వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఫిర్యాదులు చేసి..

కౌన్సిలర్లను ముందు పెట్టి వెంచర్లపై, నిర్మాణాలపై ఫిర్యాదులు చేయించి ఆ తర్వాత షాడో కౌన్సిలర్లు రంగంలోకి దిగుతున్నారన్న టాక్ మున్సిపల్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. అధికారంలో ఉన్న కౌన్సిలర్ల పేరుతో మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా ఫిర్యాదు నమోదు చేయించడం, ఆ ఫిర్యాదు ఆధారంగా అధికారులు వెంచర్ వద్దకు, నిర్మాణం వద్దకు వెళ్లి నోటీసులు ఇవ్వడం, ఆ తర్వాత రాజీ పేరుతో తెరవెనుక బేరసారాలు సాగడం ఇప్పుడు పరిపాటిగా మారిందన్న చర్చ జోరుగా సాగుతోంది. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయని స్థానికంగా చెప్పుకుంటున్నారు.

కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లు, వెంచర్లే టార్గెట్

ప్రధానంగా కొత్తగా చేస్తున్న వెంచర్లు, కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లే టార్గెట్‌గా ఈ దందా సాగుతోంది. బల్దియా పరిధిలో ఎక్కడైనా కొత్తగా పిల్లర్లు లేస్తున్నా.. లేఅవుట్ వేస్తున్నా చాలు వెంటనే వారి దృష్టికి వెళుతుంది. లేఅవుట్‌లో తేడా ఉందా, పార్క్ స్థలం వదిలారా లేదా.. రోడ్డు వెడల్పు తక్కువ ఉందా.. ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఉందా లేదా, సెట్ బ్యాక్ వదిలారా అంటూ నిశితంగా పరిశీలించి వెంచర్ నిర్వాహకులను, ఇంటి యజమానులను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకసారి టార్గెట్ చేసిన తర్వాత వరుస ఫిర్యాదులతో ఉక్కిరిబిక్కిరి చేసి వసూళ్లకు తెగబడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

200 గజాలు ఆక్రమణ అంటూ ప్రచారం

ఇటీవల ఓ వెంచర్‌లో 200 గజాల స్థలం ఆక్రమణ జరిగిందంటూ ప్రచారం చేసి బెదిరింపులకు పాల్పడిన ఘటన దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. ఆక్రమణ జరిగిందని, నాలా స్థలాన్ని కబ్జా చేశారని, అనుమతులు లేకుండా అమ్మకాలు చేస్తున్నారని, పర్మిషన్‌కు మించి నిర్మాణం చేస్తున్నారని రకరకాల ఆరోపణలతో ఫిర్యాదులు చేసి, ఆ తర్వాత ఆ ఫిర్యాదులను ఉపసంహరించుకోవడానికి లక్షల్లో డిమాండ్ చేస్తున్నారని వెంచర్ నిర్వాహకులు, ఇళ్ల యజమానులు వాపోతున్నారు.



అభివృద్ధి పనుల పరిశీలన

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మండలంలోని సోమారెడ్డి తండా గ్రామపంచాయతీలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎంపీడీవో తాహెరా బేగం శనివారం పరిశీలించారు. గ్రామంలో పర్యటించి పనుల పురోగతి, నాణ్యత, అమలు తీరును పరిశీలించారు. గ్రామంలో నిర్మిస్తున్న నీటి నిల్వ చెరువు (హార్వెస్టింగ్ పాండ్) పనులను పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. జలసిరి పనుల్లో భాగంగా 10 కుటుంబాలకు మ్యాజిక్ సోక్‌పిట్ల నిర్మాణానికి మార్కవుట్ చేశారు. వర్షం నీటిని భూమిలోకి ఇంకేలా వీటిని నిర్మించడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు దోహదపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ పర్యటనలో ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

అక్షరటుడే, కోటగిరి : పోతంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, బాన్సువాడ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నియోజకవర్గ పరిశీలకులు తోట ఆగన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మండలంలోని సుంకిని, కొల్లూరు, పొతంగల్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పార్టీ కండువా కప్పుకున్నారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, మోరి కిషన్, తెల్ల రవికుమార్,సుధాం నవీన్, గాండ్ల మధు, ఇజాజ్, ఆరిఫ్,మాజీ ఎంపీటీసీ సాయిలు, అప్రోచ్, సాయిలు, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మండలంలోని సబ్బల్‌పూర్ గ్రామంలో శనివారం గ్రామ ప్రజలతో డీఎస్పీ శ్రీనివాస్ రావు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలకు వివరించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎస్సై రాజు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





చిల్లర రాజకీయాలు మానుకోవాలి

అక్షరటుడే, ఆర్మూర్ : చిల్లర రాజకీయం మానుకోని, అభివృద్ధి కి సహకరించాలని బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు అన్నారు. ఇటీవల రెండు పడక గదుల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపించడం సరైంది కాదన్నారు. ప్రతిదీ అధికారుల సమక్షంలోనే జరిగిందన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ కార్యాలయం, ఇంటిగ్రేట్ రెవెన్యూ కార్యాలయం ఒకే చోటు ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే నిధుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నూతుల శ్రీనివాస్ రెడ్డి, పుల్కం వేణు, వివేక్, కలిగోట గంగాధర్, ఉదయ్ గౌడ్, కలిగోట్ ప్రశాంత్ ఉన్నారు.

బీజేపీకి అనుకూలంగా 'సర్' ప్రక్రియ: నగేష్ రెడ్డి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: దేశవ్యాప్తంగా బీజేపీకి అనుకూలంగానే ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతోందని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు నగరంలోని డీసీసీ కార్యాలయంలో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమం పూర్తిగా బీజేపీ పార్టీకి అనుకూలంగా ఉందన్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని అఖిల పక్షం తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆయనను తొలగించేవరకు ఈ వారం రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ, మిత్రపక్షాలతో కలిసి వివిధ రూపాలలో నిరసనలు చేస్తామని తెలిపారు. దేశ ప్రధాని మోదీ, అమిత్ షాకు ఎన్నికల కమిషనర్ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం, మంగళవారం మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలో భారీ నిరసన ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, సీపీఐ వనమాల కృష్ణ, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి కటారి రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ ఏం ఎల్ నగర కార్యదర్శి సుధాకర్, సయ్యద్ ఫిరోజ్ అలీ, రఘురామ్ గారు, పిట్ల నరేష్ గారు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి అభివృద్ధికి రూ.200 కోట్లు మంజూరు చేయండి

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి పురపాలక పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి సీడీఎంఏ డైరెక్టర్ శ్రీదేవిని కోరారు. శనివారం జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పట్టణ సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పారిశుధ్య నిర్వహణ, ఇతర ప్రజా వసరాల కోసం ఈ నిధులు అత్యంత ఆవశ్యకమని చైర్‌పర్సన్ వివరించారు. నిధులను త్వరితగతిన మంజూరు చేసి కామారెడ్డి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సహకరించాలని సీడీఎంఏను అభ్యర్థించారు.



దేశాయి బ్రదర్స్ బీడీ కంపెనీపై చర్యలు తీసుకోవాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : బీడీ కార్మికుల పొట్టగొడుతున్న దేశాయి బ్రదర్స్ బీడీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్, రాజకీయ, బీడీవర్కర్స్ యూనియన్ జేఏసీల ఆధ్వర్యంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజకీయ, బీడీవర్కర్స్ యూనియన్ జేఏసీ కన్వీనర్ అన్వేష్ రెడ్డి, ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు కరీంనగర్ మెదక్ నిర్మల్ అదిలాబాద్, మహబూబ్ నగర్‌లలో ప్రధానంగా ఈ పరిశ్రమ ఉందన్నారు. దేశాయి బ్రదర్స్ యజమాన్యం కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తూ వెయ్యి బీడీలకు రూ.10 చొప్పున అదనంగా తీసుకుంటూ శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతు తాను బీడీ కార్మికులకు మద్దత్తుగా ఉంటానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా అధ్యక్షులు ఎం ముత్తెన్న, ప్రధాన కార్యదర్శి ఆర్ రమేష్, ఉపాధ్యక్షుడు సత్తెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అక్షరటుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
శనివారం
3.10.2026

www.aksharatoday.in
AKSHARA TODAY

పోతంగల్ మండలంలో వరి కోతలు ప్రారంభం



అక్షరటుడే, కోటగిరి : పోతంగల్ మండలంలో ప్రస్తుత సీజన్‌కు సంబంధించి వరికోతలు శనివారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో మొత్తం 13,888 ఎకరాల్లో వరి పంట సాగు అయిందని, ఇందులో భాగంగా పోతంగల్ గ్రామంలో ఈరోజు సుమారు 15 ఎకరాల్లో వరి పంట కోతలు చేపట్టినట్లు రైతులు తెలిపారు. కోతకు వచ్చిన ధాన్యంలో సుమారు 30 శాతం తేమ (Moisture) ఉన్న పచ్చి వడ్లకు ప్రైవేట్ రైస్ మిల్లర్లు క్వింటాల్‌కు రూ.3,500 ధర చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు. లభిస్తున్న ధర పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. కోతలు జరుగుతున్న పొలాల్లో ఎకరాకు సుమారు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు రైతులు తెలిపారు. ఆశించిన స్థాయిలో దిగుబడి రావడంతో పాటు, పచ్చి వడ్లకు ప్రైవేట్ మిల్లర్ల నుంచి లభిస్తున్న ధర పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారి నిశిత వరికోతలను పరిశీలించారు.

బీఎడ్ అధ్యాపకులకు సన్మానం



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి రక్తదాతల సమూహ గౌరవ అధ్యక్షుడు, ఎస్వీ టీచర్ ప్లస్ ఈ లెర్నింగ్ అకాడమీ ఫౌండర్ డాక్టర్ వేద ప్రకాష్ ఆధ్వర్యంలో గురు వందనం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ విద్యావేత్తల పురస్కారాలు కార్యక్రమాన్ని రవీంద్రభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ప్రిన్సిపల్స్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ ఆఫ్ ఎడ్యుకేషన్ (పేస్ ఇండియా) తెలంగాణ, తెలంగాణ బి.ఎడ్ లెక్చరర్స్ అసోసియేషన్, తెలంగాణ ప్రైవేట్ బి.ఎడ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలలో పనిచేస్తున్న 31 మంది అధ్యాపకులను సన్మానించారు. విద్యా ప్రమాణాల అభివృద్ధికి, భవిష్యత్ ఉపాధ్యాయుల రూపకల్పనకు కృషి చేస్తున్న బీఎడ్ ఉపాధ్యాయులను సన్మానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

కరెంటు కోతలతో కన్నెర్ర చేసిన రైతన్న.. రోడ్డుపై రాస్తారోకో



అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: కరెంటు కోతలతో సాగునీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు కన్నెర్ర చేశారు. ఈ మేరకు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. శాంతాపూర్, మాన్యపూర్, సీతారాంపల్లి, జగన్నాథ్ పల్లి, రాజపూర్ గ్రామస్తుల రైతులు రహదారిపై రాస్తారోకో చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని రైతులు ఆరోపించారు. రైతులు జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో జగన్నాథ్ పల్లి, శాంతాపూర్, చౌరస్తాలో బైటయించి నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు చరవాణిలో రైతులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని హామీఇచ్చారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం: డ్రైవర్ దుర్మరణం, క్లీనర్‌కు తీవ్ర గాయాలు



అక్షరటుడే, డిచ్‌పల్లి: లారీని డీసీఎం ఢీకొట్టింది.. 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి మండలం చంద్రాయన్ పల్లి శివారులో తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో వేగంగా వెళ్తున్న డీసీఎం, లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు ధ్రువీకరించారు. డీసీఎంలో ఉన్న క్లీనర్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు.

జిల్లా రెడ్‌క్రాస్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈమారు ఎన్నికలను పలువురు అభ్యర్థులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ మేరకు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పూర్తి సేవా సంబంధిత సంస్థ అయిన రెడ్‌క్రాస్‌లో ఈ ఏడాది ఎన్నికలు రసవత్తరంగా జరగనున్నాయి. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



రెడ్‌క్రాస్ ఎన్నికలకు రంగం సిద్ధం..

■ నగరంలో ఆదివారం ఎన్నికలు ■ ఏర్పాట్లు చేసిన అధికారులు
■ నువ్వానేనా అన్నట్లుగా ప్యానెళ్ల ప్రచారాలు..

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 30 జిల్లా శాఖలతో పాటు నిజామాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీకి సైతం ఈనెల 4వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. నగరంలోని ఆదర్శ హిందీ మహా విద్యాలయంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. డీసీవో శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తంగా 29మంది సభ్యులు పోటీలో ఉన్నారు. ఎన్నిక అనంతరం పాలకవర్గం ఏర్పాటవుతుంది.

సొసైటీలో 9,826 మంది సభ్యులు

దశాబ్దాల కింద జిల్లాలో ప్రారంభమైన రెడ్‌క్రాస్‌సొసైటీలో ప్రస్తుతం 9,826 మంది సభ్యులు ఉన్నారు. పూర్తి సేవాభావంతో సేవలందించే ఈ స్వచ్ఛంద సేవాసంస్థ స్వయంప్రతిపత్తితో పనిచేస్తుంది. రాష్ట్రపతి గౌరవాధ్యక్షురాలిగా, రాష్ట్ర గవర్నర్ అధ్యక్షుడిగా ఉంటారు. అలాగే జిల్లాస్థాయిలో కలెక్టర్ దీనికి అధ్యక్షుడిగా కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటారు. అయితే ప్రభుత్వ పరంగా ఎలాంటి నిధులు రాకపోయినప్పటికీ ప్రజలు స్వచ్ఛంద సంస్థలు ఇచ్చే విరాళాలు.. మెంబర్‌షిప్ ఫీజులపైనే ఈ సేవాసంస్థ పనిచేస్తుంది.

రక్తదాన శిబిరాలు.. తలసేమియా వార్డు..

ఖలీల్‌వాడి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా వార్డు ఏర్పాటైంది. ఇందులో ప్రస్తుతం 88మంది వ్యాధిగ్రస్తులకు రక్తం అందిస్తున్నారు. అలాగే వారికి ఉచితంగా మందులు,భోజనం, రానుపోను ఖర్చులు, ల్యాబ్ ఖర్చులు సైతం రెడ్‌క్రాస్ భరిస్తోంది. సొసైటీ కార్యాలయంలో ఎస్‌డీపీ మిషన్ కూడా ఏర్పాటు చేశారు. సొసైటీ పరిధిలో ఇందల్వాయిలో వృద్ధాశ్రమం కూడా నిర్వహిస్తున్నారు. అలాగే వృద్ధుల కోసం ప్రణామ్ కేర్ సెంటర్ కూడా నిర్వహిస్తున్నారు.

పోటాపోటీ ప్రచారాలు

ఈ ఏడాది ఎన్నికలు రసవత్తరంగా జరగనున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రెండు ప్యానెళ్లు హోరాహోరీగా పోరాడుతున్నాయి. బుస్సా ఆంజనేయులు ప్యానెల్, ఇందూరు సేవా సమితి ప్యానెల్ పేరుతో రెండు వర్గాలు పోటీలో ఉన్నాయి. అనుభవమున్న వారిని ఎన్నుకుంటే మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని బుస్సా ప్యానెల్ పేర్కొంటుంది. అలాగే కొత్త వారికి అవకాశమిస్తే ఉత్సాహంగా పనిచేస్తామని ఇందూరు సేవా సమితి ప్యానెల్ సభ్యులు పేర్కొంటున్నారు. దీంతో ఎపరు గెలుస్తారోననే ఉత్కంఠ నెలకొంది.

రెండు డీఏల విడుదలపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు



అక్షరటుడే, కామారెడ్డి: తెలంగాణ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల విడుదలకు క్యాబినెట్‌లో ఆమోదం తెలపడంపై టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా నాయకులు నరాల వెంకట్ రెడ్డి, ముల్క నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటైన పెండింగ్ డీఏల విడుదలకు క్యాబినెట్ లో తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి, మంత్రివర్గ సభ్యులకు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విచ్ఛిన్నంగా ఉన్న సుమారు 206 సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి టీజీఈజేఏసీగా నిర్మాణం చేసి, క్షేత్ర స్థాయిలో ఎన్ని నిందలు వచ్చినా భరిస్తూ చాణక్య నీతితో, గాంధేయ మార్గంలో ఈ విజయాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించిన టీజీఈజేఏసీ ఛైర్మన్, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ముజీబ్ తదితర నాయకత్వానికి జిల్లా సంఘం పక్షాన, ఉద్యోగుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.

గగ్గుపల్లిలో హర్ ఘర్ జల్ కార్యక్రమం



అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని సర్పంచ్ కొండి నడిపి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిఇంటికీ తాగునీటి సౌకర్యం, నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ గంగాధర్ మాట్లాడుతూ గగ్గుపల్లి గ్రామంలో 100 శాతం ఇళ్లకు తాగునీటి నల్లా కనెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పైపులైన్లు, నల్లా కనెక్షన్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన చోట మరమ్మతులు చేపడుతున్నామని పేర్కొన్నారు. తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ కోరారు. మిషన్ భగీరథ ఏఈ నరేందర్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరులో ఎంపీడీవో పర్యటన

అక్షరటుడే, ఆర్మూర్: జిల్లాలోనే తొలిసారిగా ఆలూర్ గ్రామ పంచాయతీలో రూ.32 లక్షల వ్యయంతో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను నిర్మిస్తున్నారు. ఈ పనులను శనివారం ఎంపీడీఓ లక్ష్మారెడ్డి, ఎంపీవో గంగ మోహన్ పరిశీలించారు. ఎంపీడీవో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోనే తొలిసారిగా ఆలూర్ గ్రామపంచాయతీలో ఈ తరహా యూనిట్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడమే లక్ష్యంగా ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాజలింగం, కారోబార్ సంతోష్ పాల్గొన్నారు.



జిల్లాస్థాయి క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులకు సన్మానం

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు, ప్రశంసలు పత్రాలు అందుకున్న విద్యార్థులను మాజీ సర్పంచ్ తీర్మాల్ రెడ్డి ఘనంగా సన్మానించారు. 2025-26లలో ఉదయ్ గౌడ్ (కబడ్డీ), జగన్ (కబడ్డీ), క్రిష్ణ (రగ్బీ), ప్రశాంత్ (రగ్బీ), ప్రియాంక (రగ్బీ), యశోద (సెపక్ తక్రా)లో విద్యార్థులు రాణించారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు, శాలువాలు అందించి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కూడా ఈ సందర్భంగా అభినందించారు.



ఇంటిగ్రేటెడ్ స్కూల్ తరలింపుపై బీఆర్ఎస్ నిరసన



అక్షరటుడే, భిక్కనూరు: భిక్కనూరు మండలానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఇతర ప్రాంతానికి తరలిస్తున్నారనే సమాచారంతో బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ తునికి వేణు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆందోళనలో నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ నిర్ణయాన్ని, స్థానిక పాలకవర్గం తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ విషయంలో గ్రామ ప్రజలకు స్పష్టమైన హామీలిచ్చారని.. గ్రామసభల్లో సైతం స్కూల్ భిక్కనూరులోనే నిర్మిస్తామని బీరాలు పలికి ఇప్పుడు విద్యాసంస్థ తరలిపోతున్నా పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. స్కూల్ మంజూరైనప్పుడు పాలాభిషేకాలు చేశారని.. మరి అదే స్కూల్ తరలిపోతున్నప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ విషయంలో పాలకవర్గం ఇంకా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని.. ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు.

వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన




అక్షరటుడే,నందిపేట్: వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా ఆర్మూర్ రేంజ్, నందిపేట సెక్షన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు వన్యప్రాణులు, అటవీ సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సంరక్షణ, వన్య ప్రాణి సంరక్షణ చట్టాలు, వన్యప్రాణులను వేటాడితే తీసుకునే చట్టపరమైన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్, బీట్ ఆఫీసర్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులకు సత్కారం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ముగ్గురు అధ్యాపకులు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ. లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో అసోసియేటర్ ప్రొఫెసర్ అఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపాల్ జేడీసీ ఎల్లారెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ అఫ్ హిస్టరీ వైస్ ప్రిన్సిపాల్ చంద్ర కాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ అఫ్ తెలుగు శంకరయ్యలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శంకరయ్య, శివ కుమార్, కృష్ణ ప్రసాద్, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ శివారులో చిరుత సంచారం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మోపాల్ మండల శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. దీంతో రాత్రివేళల్లో బయటకు వెళ్లాలంటేనే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మోపాల్ మండలం మోతీరాం నాయక్ తండా నుంచి కాల్పోల్ వెళ్లే దారిలో శుక్రవారం కొందరికి చిరుత కనిపించింది. దీంతో భయాందోళనలకు గురైన వారు వెంటనే సమీప గ్రామాల ప్రజలకు అలర్ట్ చేశారు. శనివారం ఉదయం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు చిరుత ఆనవాళ్లు తెలుసుకునేందుకు మోపాల్ గ్రామాన్ని సందర్శించారు.